నేడు కీసరగుట్ట ఆలయ నూతన చైర్మన్ ప్రమాణ స్వీకారం



నాగలింగం

కీసర: కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వర స్వామి దేవాలయ నూతన చైర్మన్‌గా శనివారం తటాకం నాగలింగం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ మేరకు దేవస్థానం అధికారులు ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం ఉదయం 11గంటలకు కీసరగుట్ట దేవాలయ మండపంలో నిర్వహించే కొత్త చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవానికి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, దేవాదాయశాఖ ఉన్నతాధికారులతో పాటు పలువురు హాజరుకానున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కొర్రెముల్ జెడ్పీ స్కూల్‌లో కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్



ప్రోగ్రామ్‌లో విద్యార్థులతో యూనివర్సిటీ అధ్యాపకులు, ఉపాధ్యాయులు

ఘట్‌కేసర్: కొర్రెముల్ జెడ్పీ స్కూల్‌లో అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సెల్ యూనిట్–3 సహకారంతో ఐఈఈఈ సీఐఎస్ చాప్టర్ ద్వారా కమ్యూనిటీ ఔట్రిచ్‌లో భాగంగా కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి అనంతరం డ్రాపౌట్స్ నివారణ, ప్రభుత్వ పథకాలు, కెరీర్ ఎంపిక, విద్యాపరమైన ఎంపికపై పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, ఐస్ బ్రేకింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యార్థులు, అధ్యాపకులు తృప్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్–3 పోగ్రామ్ ఆఫీసర్ మధుకర్, హెచ్ఎం వరలక్ష్మీ, వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ కోర్సులకు ఆన్‌లైన్ పరీక్ష



కోర్సులకు ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తున్న నిర్వాహకులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని టెక్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు ఘన్‌పూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యార్థుల ఎంపిక కోసం ఉచిత ఆన్‌లైన్ పరీక్షను శుక్రవారం నిర్వహించారు. కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు టెక్స్ అకాడమీ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు. పరీక్ష అనంతరం కోర్సులకు ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం పక్షాన అసోసియేట్ ప్రొఫెసర్ డా.జే. శ్రీకాంత్ అభినందించారు.

ఆటో డ్రైవర్ల మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



మేడ్చల్: ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడాన్ని నిరసిస్తూ ఆటో డ్రైవర్లు చేపట్టిన మహాధర్నా వాల్‌పోస్టర్‌ను మేడ్చల్‌లో ఆటో డ్రైవర్లు, పలు యూనియన్ల నాయకులు విడుదల చేశారు. నెలకు రూ.15 వేల జీవన భృతి ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 7వ తేదీన నగరంలోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయరావు, మహేష్‌యాదవ్, గోపాల్, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వేణుగోపాల్

ఘట్‌కేసర్: మండల ముదిరాజ్ సంఘం నూతన సంవత్సరం కేలండర్‌ను ప్రతాపసింగారంలో శుక్రవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే హాజరై కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌ముదిరాజ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్ ముదిరాజ్, నరేశ్‌ముదిరాజ్, రాధాకృష్ణ, కుమార్ ముదిరాజ్, అంజిరెడ్డి, ముత్యాలుయాదవ్, ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల ఊరేగింపు



శ్రీరంగవరం గ్రామంలో అక్షింతలను అందజేస్తున్న నాయకులు

మేడ్చల్: అయోధ్య రాముడి అక్షింతల వితరణ కార్యక్రమం మండలంలోని పలు గ్రామాలు, మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో జోరుగా కొనసాగుతోంది. అయోధ్య ట్రస్ట్ సభ్యులు, బీజేపీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని ఇంటింటికీ వెళ్లి అక్షింతలను అందజేశారు. గ్రామంలో ఊరేగించి హనుమాన్ ఆలయంలో ఉంచిన రాముల వారి అక్షింతలను భాజాభజంత్రీలతో ఇళ్లకు తీసుకెళ్లి అందజేస్తున్నారు.

సీసీరోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

మేడిపల్లి: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం 11వ డివిజన్ కార్పొరేటర్ మద్ది యుగేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనులను పర్యవేక్షిస్తూ డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తూ అనేక పనులు చేపడుతున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని 40ఫీట్ల రోడ్డులో కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించి నాణ్యత పాటించాలని అన్నారు. నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్పొరేటర్ వెంట పలువురు కాలనీవాసులు ఉన్నారు.



చీర్యాల రెవెన్యూ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ..



అక్రమ నిర్మాణాలు నేలమట్టం

ప్రభుత్వ స్థలాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలు

- దాదాపు 47 అక్రమ నిర్మాణాల కూల్చివేత
- పోలీసు బందోబస్తు మధ్య కొనసాగిన వైనం
- ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఊరుకోం..
- త్వరలో మరికొన్ని ప్రాంతాల్లో కూల్చివేస్తాం..
- కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరిక
- రియల్టర్లు మోసం చేశారంటున్న బాధితులు
- వారిపై చర్యలు తీసుకోవాలంటూ వేడుకోలు



నాగారం మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ..

కీసర: ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్–84లోని ప్రభుత్వ స్థలంలో వెలసిన 15, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కుందన్‌పల్లి సర్వే నెంబర్–152, 153లోని ప్రభుత్వ స్థలంలో వెలసిన 17 అక్రమ నిర్మాణాలతో పాటు కీసర మండలంలోని చీర్యాల గ్రామంలోని సర్వే నంబర్ 224లో వెలసిన 15 అక్రమ నిర్మాణాలను శుక్రవారం జేసీబీల సహాయంతో పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. అక్రమ నిర్మాణాలను గతంలోనే గుర్తించిన అధికారులు శుక్రవారం తెల్లవారుజాము నుంచే అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, అసైన్డ్ స్థలాల్లో ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల విధుల్లో అధికారులు ఉండటంతో అక్రమార్కులు అసైన్డ్ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు చెప్పారు. మరికొన్ని ప్రభుత్వ స్థలాల్లోనూ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని, త్వరలో వాటిని కూడా కూల్చివేస్తామని అధికారులు చెప్పారు. ఆర్ఐ కిషోర్, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రియల్టర్లు మోసం చేశారు..

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్–84లోని ప్రభుత్వ స్థలంలో కొంతమంది రియల్టర్లు తమను మోసం చేసి ప్లాట్లు విక్రయించారని, పైసాపైసా కూడగట్టి ప్లాట్లు కొనుగోలు చేసుకున్నామని, ఇటీవల కాలంలో ఇంటి నిర్మాణాలకు ఒక్కో ఇంటి నుంచి రూ.2 నుంచి రూ.3 లక్షలు వసూలు చేశారని, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితులు వాపోయారు.

మా భూములు మల్లారెడ్డి కబ్జా చేశారు

లక్ష్మీకాపూల్: మాజీ మంత్రి మల్లారెడ్డి కబ్జా చెర నుంచి తమ భూములను విడిపించాలని మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లికి చెందిన చెందిన క్రాంతి విజ్ఞప్తి చేశారు. క్రాంతితోపాటు బాధితులు శుక్రవారం పెద్ద సంఖ్యలో ప్రజాభవన్‌కు తరలివచ్చి ఫ్లెక్సీలతో ఆందోళన చేశారు. తమ భూములను మల్లారెడ్డి కబ్జా చేశారని వాపోయారు. శ్రీ మల్లిఖార్జున నగర్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీలో 22 ఎకరాల లేఅవుట్‌లోని 366 ప్లాట్లకు గానూ 230 ప్లాట్లను శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి కబ్జా చేసి.. రైతుబంధును అనుభవిస్తున్నట్లు ఆరోపించారు. ఈ క్రమంలో తమ భూములను మల్లారెడ్డి కబ్జా చేశారంటూ ఫ్లెక్సీలతో ఆందోళనకు దిగారు.

సీతారామచంద్ర స్వామి కల్యాణానికి ఆహ్వానం

మల్లాపూర్: ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి విద్యా సంస్థల చైర్మన్ మల్కా కొమరయ్య ఆధ్వర్యంలో శ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి ప్రత్యేక పర్యవేక్షణలో శనివారం సాయంత్రం 4 గంటలకు జరిగే సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవానికి ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఏలైట్ ఇన్ఫో టెక్నాలజీస్ సంస్థ డైరెక్టర్ గోనే శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

అల్వాల్ ఇన్‌స్పెక్టర్‌గా రాహుల్‌దేవ్

అల్వాల్: అల్వాల్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా శుక్రవారం రాహుల్‌దేవ్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

అవినీతి, అక్రమాలను బయటపెడతాం..

- బీఆర్ఎస్ తీరు దొంగే.. దొంగ అని అరిచినట్లు ఉంది
- రాష్ట్రాన్ని దోచుకున్నది కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులే..
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 30 రోజులే.. అప్పుడే చవాకులా..?
- కబ్జాల బండారాన్ని త్వరలో బయటపెట్టి.. జైలుకు పంపుతాం
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూరి వజ్రేష్ యాదవ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: బీఆర్ఎస్ పార్టీ తీరు చూస్తే దొంగే.. దొంగ దొంగ అని అరిచినట్లుగా ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూరి వజ్రేష్‌యాదవ్(జంగయ్య) విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టి 30 రోజులు కూడా పూర్తి కాలేదు.. అప్పుడే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ 420 హామీల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని అవాకులు, చవాకులు పేల్చడం సిగ్గుచేటు అన్నారు. బోడుప్పల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని దోచుకుని, దాచుకున్నది మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులేనని ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తొమ్మిదిన్నర ఏళ్లలో తెలంగాణ ప్రజలకు అమలు చేయలేని హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిందని, అందుకే ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టారని పేర్కొన్నారు. పరిపాలనకు అక్కరకు రారని ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరించినా.. పదవి వ్యామోహంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి మల్లారెడ్డితో సహా కొందరు బీఆర్ఎస్ నాయకుల అవినీతి, అక్రమాలను వెలికి తీసేందుకు తగిన కార్యాచరణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు, సీలింగ్ ల్యాండ్‌ను కబ్జా చేసిన ఘన చరిత్ర మాజీ మంత్రితో సహా పలువురు బీఆర్ఎస్ నాయకులకు ఉందని, వారి బండారాన్ని త్వరలో బయటపెట్టి, జైలు కూడు తినేలా చేస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముసుగులో చేసిన అక్రమాలను కక్కించి, వారిని ప్రజల్లో ఎండగడతామన్నారు.

ఈఎస్ఐ డిస్పెన్సరికి మరోసారి తాళం



తాళం వేయడంతో పడిగాపులు కాస్తున్న రోగులు

మేడ్చల్: తన భవనంలో కొనసాగుతున్న ఈఎస్ఐ ఆస్పత్రికి ఓ రాజకీయ నాయకుడు తాళం వేసి రోగులను ఇబ్బందులకు గురిచేశాడు. మేడ్చల్ పట్టణంలో వినాయక్‌నగర్ కాలనీలో ఓ బీఆర్ఎస్ నేతకు చెందిన భవనం ఉండగా అందులో ఈఎస్ఐ డిస్పెన్సరీ కొనసాగుతోంది. అద్దె విషయంలో భవన యజమానికి ఆస్పత్రి అధికారులకు కొన్ని రోజులుగా వివాదం నడుస్తోంది. రెండు నెలల క్రితం అద్దె విషయం వివాదంలో ఉండగా గతంలో ఆస్పత్రి భవనానికి తాళం వేశాడు. కాంగ్రెస్ నాయకులు, అధికారులు, పోలీసులు అందరూ కలిసి డిసెంబర్ 12న తాళం తీసి ఆస్పత్రిని తెరిపించారు. తిరిగి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు. మళ్లీ సమస్య తలెత్తడంతో సదరు భవన యజమాని శుక్రవారం తాళం వేశాడు. దీంతో ఆస్పత్రికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రభుత్వ భూములు కాపాడాలంటూ వినతి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని సర్వే నంబర్ 63/28 నుంచి 63/39లో గల ప్రభుత్వ భూములను కాపాడాలంటూ సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ శుక్రవారం ఆర్ఐ సునీతకు వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ ఆధ్వర్యంలో 22 ఎకరాలు ప్రభుత్వ భూమిగా గతంలో గుర్తించారని, అందులో ప్రస్తుతం అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి భూకబ్జా దారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను కాపాడాలని ఆయన వినతి పత్రంలో కోరారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్, బీకేఎంయూ మండల అధ్యక్షుడు భూతం ఐలయ్య, నాయకులు ఇస్తారి, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

బఫర్ జోన్‌లో బహుళ అంతస్తులు ఆపాలంటూ వినతి

చెంగిచర్ల చింతల చెరువు కింద బఫర్‌జోన్‌లో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణాలను ఆపాలంటూ బోడుప్పల్ కమిషనర్‌కు శుక్రవారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు కుర్రి శివశంకర్ వినతి పత్రం అందజేశారు. అనంతరం చెంగిచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్‌కు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే కుమారుడు బఫర్‌జోన్‌లో అనుమతులు తీసుకుని బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని అన్నారు. అంతేగాకుండా రెండున్నర ఎకరాల బఫర్ జోన్ కబ్జాకు గురైందని, ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కలిసి సర్వే నిర్వహించి చెరువు కింద ఉన్న బఫర్ జోన్‌కు హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాలను తొలగించాలని కోరారు. చర్యలు తీసుకోకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు మేకల యాదగిరి, పురుషోత్తంరెడ్డి, నరేందర్ తదితరులున్నారు.

8న ఐటీఐలో అప్రెంటిస్ మేళా

మేడ్చల్: ఈ నెల 8వ తేదీన మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు మేళాకు హాజరై తమకు కావాల్సిన అభ్యర్థులను ఎన్నిక చేసుకుంటారని తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణత చెందిన వారు మేళాకు హాజరుకావాలని ఆమె కోరారు.

ఆర్టీసీ వన భోజనాలు



మేడ్చల్: మేడ్చల్ ఆర్టీసీ డిపోలో కార్మికులు వన భోజనాలు చేశారు. డిపోలో కార్మికులు, అధికారులు కలిసి సహపంక్తి భోజనాలు చేసి ఉల్లాసంగా గడిపారు. కార్మికులు, అధికారులు అందరూ కలిసి వన భోజనాల పేరుతో సమావేశమై పండగలా గడిపారు. కార్యక్రమంలో మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ డీఎం రామారావు తదితరులు పాల్గొన్నారు.

అలివేలుకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న అలివేలు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌కు చెందిన సామల అలివేలుకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఫార్మాసూటికల్ సైన్సెస్ అనే అంశంపై పరిశోధనపై చేసినందుకు నగరంలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ శుక్రవారం డాక్టరేట్ అందజేసింది. ముఖ్య అతిథి ఇస్రో చైర్మన్ సోమనాథ్, యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నరసింహారెడ్డి ఆమెకు గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త పద్మారెడ్డి, స్థానికులు ఆమెకు అభినందనలు తెలిపారు.

పురపాలికల్లో క్యాంపు రాజకీయాలు!

- పలుచోట్ల భగ్గుమంటున్న అవిశ్వాస జ్వాలలు
- విహార యాత్రతో అసమ్మతి వర్గాలకు బుజ్జగింపులు!
- అసమ్మతి చల్లార్చేందుకూ.. రంగంలోకి పార్టీ పెద్దలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: పురపాలికల్లో అవిశ్వాస జ్వాలలు భగ్గుమంటున్నాయి. వీటిని ఆదిలోనే చల్లార్చేలా.. రంగ ప్రవేశం చేసిన బీఆర్ఎస్ నేతలు తమదైన శైలిలో ప్రయత్నాలు చేస్తుండగా, మరో పక్క పలువురు మేయర్లు, చైర్మన్లు కార్పొరేటర్లు, కౌన్సిలర్లను బుజ్జగించేందుకు విహార యాత్ర పేరుతో క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. రాష్ట్రంలో 26 పురపాలక సంఘాల చైర్‌పర్సన్లు, తొమ్మిది మంది వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇవ్వగా, ఇందులో హైదరాబాద్ నగర శివారు జవహర్‌నగర్, దమ్మాయిగూడ, మేడ్చల్, ఆదిభట్ల, ఇబ్రహీంపట్నం పురపాలక సంఘాలు ఉన్నట్లు పురపాలక శాఖ పేర్కొంటోంది.

అసమ్మతి సభ్యుల వ్యూహారచన

అదే బాటలో పలు పురపాలికల్లో అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టే దిశగా అసమ్మతి సభ్యులు వ్యూహారచన చేస్తున్నారు. దీంతో పాలక వర్గాలు తమ పదవిని కాపాడుకునేందుకు శాయశక్తులు ఒడ్డుతుండగా.. వైరి వర్గం మాత్రం వారి నుంచి కుర్చీ దక్కించుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తోంది. నగర శివారులోని మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో ఏడు కార్పొరేషన్లు, 22 మున్సిపాలిటీలు ఉండగా, అధిక స్థానాల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన కౌన్సిలర్లు, కార్పొరేటర్లే చైర్మన్లు, మేయర్లు ఎక్కువగా కొనసాగుతున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు, తొమ్మిది మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్‌కు చెందిన వారే మేయర్లు, చైర్మన్లుగా ఉండటంతో తమ పదవులను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు.

విహార యాత్రకు వెళ్లేలా షెడ్యూల్..

ఈ నేపథ్యంలోనే మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఓ నగరపాలక సంస్థకు చెందిన మేయరు అవిశ్వాస జ్వాల నుంచి బయటపడేలా.. 26 మంది కార్పొరేటర్లతో సహా ఐదుగురు కోఆప్షన్ సభ్యులను బుజ్జగించేందుకు తమ శక్తియుక్తులను వినియోగిస్తున్నారు. అందులో భాగంగా వారందరూ వారం రోజుల పాటు విహార యాత్రకు వెళ్లేలా షెడ్యూల్ ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి బయలుదేరనున్న ఈ విహార యాత్రకు ఫ్లైట్ టికెట్లు కూడా బుక్ చేశారు. అలాగే, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని పలు పురపాలక సంఘాలకు చెందిన పలువురు మేయర్లు, చైర్మన్లు కూడా విహారయాత్రలను ఫిక్స్ చేసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

నోటీసులు ఇచ్చేందుకు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బోడుప్పల్, నాగారం, గుండ్లపోచంపల్లి, తూముకుంట, పోచారం, కొంపల్లితో సహా పలు పురపాలికల్లో అవిశ్వాస తీర్మానంపై నోటీసు ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ అవిశ్వాస నోటీసులకు తెరవెనుక కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పెద్దలు రాజకీయం నడుపుతున్నట్లు తెలుస్తోంది. అలాగే, అసమ్మతి వర్గంగా ఉన్న బీఆర్ఎస్ నేతలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు కూడా పరోక్షంగా మద్దతు ఇస్తున్నట్లు ఆయా పురపాలక సంఘాల్లో ప్రచారం సాగుతోంది. అయితే పలువురు మేయర్లు, చైర్మన్ల ఒత్తిడి మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రంగంలోకి దిగి అవిశ్వాస తీర్మానానికి సిద్ధమవుతున్న వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి



రాజబొల్లారంలో దరఖాస్తులు అందజేస్తున్న తహసీల్దార్ శైలజ

మేడ్చల్: ప్రజాపాలన కార్యక్రమం మండల కేంద్రంతో పాటు మున్సిపాలిటీల్లో శుక్రవారం సాగింది. వార్డులు, గ్రామాల్లో అధికారులు సభలు నిర్వహించి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రాజబొల్లారం గ్రామంలో నిర్వహించిన సభలో తహసీల్దార్ శైలజ పాల్గొని దరఖాస్తులు అందజేశారు. సర్పంచ్‌లు, కౌన్సిలర్లు ఎంపీటీసీలు, ఎంపీడీఓ పద్మావతి, కమిషనర్ రాములు, త్రిలేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

కీసర: నాగారం మున్సిపాలిటీలో చేపడుతున్న ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి శుక్రవారం మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో ఆయన మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌తో కలిసి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజాపాలన దరఖాస్తులు అందించేందుకు శనివారం ఒక్కరోజు మాత్రమే అవకాశం ఉన్నందున మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో దరఖాస్తుల స్వీకరణను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, కమిషనర్ రాజమల్లయ్య సూచించారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే ధర్నాలు చేస్తాం



నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకపోతే ప్రజల తరఫున బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నాగారం మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలకు దరఖాస్తులను స్వీకరించడాన్ని స్వాగతిస్తున్నామని, పథకాలను అమలు చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలకు న్యాయం చేసేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని, ఎక్కడికక్కడ కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.